9th HAPPY ANNIVERSARY

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు

సంవత్సరాల ప్రయాణం

సంపుటి : 10 | సంచిక : 309 | పేజీలు : 4+8 | ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ : పి. గౌతమి | బుధవారం 17 జూలై 2024

Published form Medchal Malkajgiri, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda


# రేపు రూ.1 లక్ష రైతు రుణమాఫీ: మంత్రి తుమ్మల..

ఆ రైతులకు మంత్రి తుమ్మల గుడ్‌న్యూస్... రేపు వారి ఖాతాల్లో నగదు జమ

రేపు రూ.1 లక్ష వరకు రుణమాఫీ చేస్తామన్న మంత్రి

30 లక్షల మంది రుణమాఫీకి రూ.31 వేల కోట్లు అవసరమని వెల్లడి

గోల్డ్ లోన్ తీసుకున్న రైతులకు పాస్ బుక్ ఉంటే రుణమాఫీ చేస్తామన్న మంత్రి




**హైదరాబాద్ పెన్ పవర్:** జూలై 18నుంచి రైతులకు రుణమాఫీ చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు...మొదట లక్ష లోపు రుణాలకు సంబందించి రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తామని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు చెప్పారు. మొదటి విడతగా రైతుల ఖాతాల్లోకి సుమారు 6వేల కోట్లు రూపాయలు జమ చేయనున్నట్లు తెలిపారు. లక్షకు పైగా రుణాలు ఉన్నవారికి మరో పదిరోజుల్లో వారి ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని తుమ్మల అన్నారు. మొత్తంగా ఆగస్టు 15 లోపు రుణమాఫీ చేస్తామని చెప్పారు. కుటుంబ నిర్ధారణ కోసమే రేషన్ కార్డు అని అన్నారు. పాత పద్దతిలోనే కుటుంబానికి రెండు లక్షల రుణమాఫీ చేస్తామని స్పష్టం చేశారు. 60 లక్షల ఖాతాల్లో 6 లక్షల మందికి రేషన్ కార్డు లేదు. అలాంటి వారికోసం రేషన్ కార్డు లేకున్నా రుణమాఫీ చేస్తామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో లక్ష రుణమాఫి చేస్తామని ఇచ్చిన కొన్ని డబ్బులు వడ్డీకే సరిపోయాయన్నారు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. రెండు లక్షల రుణమాఫీ ఒకేసారి చేస్తుంటే బీఆర్ ఎస్ మామీద నిందలు వేస్తుందన్నారు. తెల్ల రేషన్ కార్డు అనేది కుటుంబ నిర్ధారణ కోసమే అన్నారు. దాదాపు 38 లక్షల కుటుంబాలు రుణాలు తీసుకున్నాయన్నారు. రుణమాఫీకోసం రూ. 31వేల కోట్లు ఖర్చు అవుతుందన్నారు మంత్రి తుమ్మల. గత ప్రభుత్వం రైతులకు ద్రోహం చేసింది.. నేను చాలా ప్రభుత్వాల్లో పనిచేశాను. ఒకేసారి రుణమాఫీ చేసింది ఒక్క కాంగ్రెస్ ప్రభుత్వమే అన్నారు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. జూలై 18న ప్రతి మండల కేంద్రాల్లో రైతు వేదికల్లో సంబరాల్లో ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.


## రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ ఆరోగ్యశ్రీ ఉండాలి..

# తెల్ల రేషన్ కార్డుతో లింక్ పెట్టొద్దు

ప్రతి ఒక్కరి డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ రూపొందించాలన్న రేవంత్

గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే వైద్యుల పారితోషికం పెంచాలన్న సీఎం

హాస్పిటల్స్ నిర్వహణకు ప్రత్యేక వ్యవస్థ తీసుకురావాలని సూచన




**హైదరాబాద్ పెన్ పవర్:**ఆరోగ్యశ్రీ పథకానికి సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలను జారీ చేశారు. తెల్ల రేషన్ కార్డుకు, ఆరోగ్యశ్రీ కార్డుకు లింక్ పెట్టొద్దని అధికారులకు సూచించారు. అందరికీ ఆరోగ్యశ్రీ కార్డులు అందించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. దీనిపై విధివిధానాలను రూపొందించాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరికీ ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులో ఉండాలని చెప్పారు. రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్కరికి డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ రూపొందించాలని అన్నారు. గిరిజన ప్రాంతాల్లో సరైన వైద్య సదుపాయాలు

వివరాలు 2లో..

## తెలంగాణలోని అంగన్వాడీలకు గుడ్ న్యూస్

- రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వనున్న సర్కారు
- టీచర్లకు రూ.2 లక్షలు, ఆయాలకు రూ. లక్ష
- రెండు రోజుల్లో జీవో జారీ.. మంత్రి సీతక్క ప్రకటన



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలోని అంగన్వాడీ కేంద్రాలలో పనిచేస్తున్న టీచర్లు, ఆయాలకు మంత్రి సీతక్క శుభవార్త ప్రకటించారు. ఇకపై పదవీ విరమణ చేసే సిబ్బందికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందిస్తామని తెలిపారు. రెండు

వివరాలు 2లో..

## కేసీఆర్ కు విశ్వసనీయత లేదు..

## ఏమైనా చేయొచ్చని రేవంత్ భావిస్తున్నారు



వివరాలు 2లో..

- అడ్డదారులు తొక్కి కాంగ్రెస్ గెలిచిందన్న ఈటల
- రుణమాఫీ నిబంధనలు రైతులకు ఉరితాడుగా మారాయని విమర్శ
- రుణమాఫీకి, రేషన్ కార్డుకు లింక్ పెట్టడం దారుణమని వ్యాఖ్య



## సుప్రీంకోర్టులో కేసీఆర్ కు ఎదురుదెబ్బ

- విద్యుత్ ఒప్పందాలపై వేసిన కమిషన్ ను రద్దు చేయాలని కేసీఆర్ పిటిషన్
- కమిషన్ విచారణ కొనసాగించాలన్న సుప్రీంకోర్టు
- కమిషన్ ఛైర్మన్ నరసింహారెడ్డిని మార్చాలని ఆదేశం

**హైదరాబాద్ పెన్ పవర్:** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్ గఢ్ నుంచి విద్యుత్ కొనుగోళ్లు, యాదాద్రి, భద్రాద్రి పవర్ ప్లాంట్ల నిర్మాణం అంశాల్లో జరిగిన అవకతవకలపై విచారించేందుకు తెలంగాణ ప్రభుత్వం జస్టిస్ నరసిహారెడ్డి ఛైర్మన్ గా కమిషన్ ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అయితే, ఈ కమిషన్ ను రద్దు చేయాలంటూ సుప్రీంకోర్టును కేసీఆర్ ఆశ్రయించారు. కేసీఆర్ పిటిషన్ ను సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. అనంతరం కేసీఆర్ పిటిషన్ ను ధర్మాసనం డిస్మిస్ చేసింది. కమిషన్ విచారణ కొనసాగించాలని తెలిపింది. కొత్తగా నోటిఫికేషన్ జారీ చేయాల్సిన అవసరం లేదని చెప్పింది. దీనిని జ్యుడీషియల్ ఎంక్వైరీ అనకుండా... ఎంక్వైరీ కమిషన్ గా వ్యవహరించాలని తెలిపింది. మరోవైపు, కమిషన్ ఛైర్మన్ గా

వివరాలు 2లో..

## సుప్రీంకోర్టుకు ఇద్దరు కొత్త జడ్జిల నియామకం

జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్, జస్టిస్ ఆర్ మహదేవన్‌ల నియామకానికి రాష్ట్రపతి ఆమోద ముద్ర

ప్రకటించిన కేంద్ర న్యాయశాఖా మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్

మణిపూర్ నుంచి సుప్రీంకోర్ట్ జడ్జిగా పదోన్నతి పొందిన తొలి వ్యక్తిగా చరిత్ర సృష్టించిన జస్టిస్ కోటీశ్వర్ సింగ్




**పెన్ పవర్ డెస్క్:**సుప్రీంకోర్టుకు కొత్త జడ్జిలుగా జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్, జస్టిస్ ఆర్ మహదేవన్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదముద్ర వేశారు. ఈ విషయాన్ని న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల మేరకు కొత్త న్యాయమూర్తులను నియమించామని, సుప్రీంకోర్ట్

వివరాలు 2లో..

## సేఫ్ జోన్ లోనూ బాంబుల వర్షం కురిపిస్తున్న ఇజ్రాయెల్

- హమాస్ ఉగ్రవాదులపై యుద్ధం ప్రకటించిన ఇజ్రాయెల్
- గాజాలోని ఖాన్ యూనిస్ నగరం శివార్లలో ఇజ్రాయెల్ దాడులు
- ఒక్క రాత్రిలో 60 మంది మృతి

వివరాలు 2లో..



**హైదరాబాద్ పెన్ పవర్:**హమాస్ ఉగ్రవాదులు ఎక్కడ దాక్కున్నా వేటాడుతున్న ఇజ్రాయెల్...తాజాగా సేఫ్ జోన్ లోనూ బాంబుల వర్షం కురిపించింది. సౌత్ గాజా నగరం ఖాన్ యూనిస్ శివారు ప్రాంతం మువాసీలో ఇజ్రాయెల్

## 'తెలంగాణ రైతన్నకు మీ రేవంతన్న మాట'..

## సీఎం ఎమోషనల్ ట్వీట్

- ఎంత కష్టమైనా.. ఎంత భారమైనా ఏక కాలంలో రైతు రుణమాఫీ
- పంద్రాగస్టులోపు రూ.2 లక్షల రుణమాఫీకి కార్యాచరణ
- రాహుల్ గాంధీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటామని వెల్లడి



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్ర రైతాంగాన్ని ఉద్దేశిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం భావోద్వేగ ట్వీట్ చేశారు. రుణమాఫీకి సంబంధించి ప్రభుత్వం సోమవారం మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ రైతులకు ఇచ్చిన మాటకు కట్టుబడి పంద్రాగస్టులోపు రూ. 2 లక్షల రుణమాఫీని

వివరాలు 2లో..

## తీహార్ జైల్లో కవితకు తీవ్ర అస్వస్థత..

## ఆసుపత్రికి తరలింపు

- 100 రోజులకు పైగా తీహార్ జైల్లో ఉంటున్న కవిత
- తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో దీన్ దయాళ్ ఆసుపత్రికి తరలింపు
- దీన్ దయాల్ ఆసుపత్రిలో కవితకు చికిత్స



ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత తీహార్ జైల్లో ఉన్న సంగతి తెలిసిందే. జైల్లో ఆమె తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆమెను జైలు నుంచి దీన్ దయాళ్ ఆసుపత్రికి వైద్య చికిత్స నిమిత్తం తరలించి, చికిత్స చేస్తున్నారు. తీహార్ జైల్లో కవిత 100 రోజులకు పైగా ఉంటున్నారు. కవిత అస్వస్థతకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఆమె తీవ్ర జ్వరంతో బాధ పడుతున్నట్టు సమాచారం. లిక్కర్ కేసులో కవిత మార్చి 15న అరెస్ట్ అయ్యారు.

## ప్రభుత్వ ఉత్తర్వులు తొలిసారి తెలుగులో జారీ చేయడం చాలా సంతోషకరం

రైతు రుణమాఫీ మార్గదర్శకాలపై తెలుగులో ఉత్తర్వులు

జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం

అభినందించిన వెంకయ్యనాయుడు

వివరాలు 2లో..



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వ ఉత్తర్వులు సహా, పరిపాలనకు సంబంధించిన అంశాలు తెలుగులో జారీ చేయాలని ఎప్పటినుంచో సూచిస్తున్నానని భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. తాజాగా, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణ మాఫీ మార్గదర్శకాలపై తెలుగులో ఉత్తర్వులు జారీ చేయడం అభినందనీయమని అన్నారు. ప్రభుత్వ

## సంపాదకీయం

### భగవాన్ శ్రీ మహావిష్ణువు కుమార్తె ఎవరో తెలుసా.. ఆమె ఎలా .. ఎందుకు జన్మించింది

తెలుగు మాసాల్లో ఆషాడానికి ప్రత్యేక స్థానముంది. చంద్రుడి గమనాన్ని బట్టి నెలల పేర్లు నిర్ణయించారు. చంద్రుడు ... పూర్వాషాడ, ఉత్తరాషాడ నక్షత్రాల వద్దకు ప్రవేశించినప్పుడు ఆ నెలను ఆషాడం అంటారు. ఒకానొక సమయంలో విధి ధర్మంచేత శ్రీ మహావిష్ణువు అలసిపోయి ఓ గుహలో విశ్రాంతి తీసుకుంటుంటగా స్వామి వారి చెమట బిందువుల నుంచి ఓ కన్య ఉద్భవించింది. అలా ఆ కన్య ఓ రాక్షసుడిని హతమార్చేందుకు ఆషాడమాసం శుక్ల పక్షం .. ఏకాదశి రోజున జన్మించిందని.. అందుకే ఆమెకు ఏకాశి అని పేరు పెట్టారని పండితులు చెబుతున్నారు.

తెలుగు మాసాల్లో ఇది నాలుగో నెల. ఆషాడంలో సూర్యుడు ఉత్తరాయణం నుంచి దక్షిణాయనంలోకి ప్రవేశిస్తాడు, అలాగే ఈ మాసంలోనే వర్ష రుతువు ప్రారంభమవుతోంది. సాధారణంగా ఆషాడాన్ని శూన్యమాసంగా భావిస్తారు. ఎలాంటి శుభకార్యాలు, వేడుకలు తలపెట్టరు. అయినప్పటికి ఆషాడం పూజలు వ్రతాలకు అత్యంత శ్రేష్ఠమైందని నమ్మకం, ముఖ్యంగా అమ్మవారినీ, ఈశ్వరుడినీ విష్ణుమూర్తిని అర్చించాలని చెబుతుంటారు.

**తొలిఏకాదశి విశిష్టత:**
ఈ నెలలోనే హిందువుల మొదటి పండుగ తొలిఏకాదశితో పర్వదినాలు ప్రారంభమవుతాయి. ఈ రోజున విష్ణుమూర్తి నిద్రకు ఉపక్రమిస్తాడనీ కనుకనే దీన్ని 'శయనైకాదశి' అని, 'హరి వాసరం' 'పేలాల పండగ' అని కూడా పిలుస్తారు.. ఒక ఏడాదిలో 24 ఏకాదశులు వస్తాయి. వీటిలో ఆషాఢ శుద్ధ ఏకాదశిని 'తొలి ఏకాదశిగా'గా పిలుస్తారు.

**పురాణాల ప్రకారం..** శ్రీ మహావిష్ణువు క్షీరసాగరంలో శేషతల్పంపై నాలుగు నెలల పాటు శయనిస్తాడు. నాలుగు నెలల తర్వాత వచ్చే ప్రబోధినీ ఏకాదశి నాడు ఆయన తిరిగి మేల్కొంటాడు. ఈ నాలుగు నెలల్ని చాతుర్మాసాలుగా వ్యవహరిస్తారు.

తొలి ఏకాదశి నుంచి నాలుగు నెలల పాటు చాతుర్మాసదీక్షను ఆచరిస్తారు. ఈ నాలుగు నెలలు మహావిష్ణువు పాతాళ లోకంలో బలి చక్రవర్తి వద్ద ఉండి కార్తీక పౌర్ణమి నాడు తిరిగి వస్తాడని పురాణగాథ ఒకటి ప్రాచుర్యంలో ఉంది.

కృతయుగంలో మురాసురుడనే రాక్షసుడు బ్రహ్మ వరంతో దేవతలను, రుషులను హింసించాడు. ఆ రాక్షసుడితో శ్రీమహావిష్ణువు వెయ్యేళ్లు పోరాడి అలని పోయి ఓ గుహలో విశ్రాంతి తీసుకుంటుండగా.. శ్రీహరి శరీరం నుంచి ఓ కన్య ఆవిర్భవించి, ఆ రాక్షసుణ్ని అంతం చేసింది. ఆకన్య ఏకాశి రోజున జన్మించిందని.. అందుకే ఆమెకు ఏకాశి అని నామకరణం చేసినట్లు విష్ణు పురాణంలో పేర్కొన్నారు. అది కాస్త కాల క్రమేణా ఏకాదశిగా మారింది.

ఇందుకు సంతోషించిన శ్రీమహావిష్ణువు ఆ కన్యను వరం కోరుకోమనగా.. తాను విష్ణుప్రియగా లోకం చేత పూజలు అందుకోవాలని కోరుకుంది. ఆమె 'ఏకాదశి' తిథిగా వ్యవహారంలోకి వచ్చింది. అప్పటి నుంచి సాధువులు, భక్తులు 'ఏకాదశి' వ్రతం ఆచరించి విష్ణుసాయుజ్యం పొందినట్లుగా పురాణాలు చెబుతున్నాయి.

**ఏకాశి వ్రతము ఎవరెవరు చేశారంటే..**
దూర్వాస మహర్షి శాపం నుంచి విముక్తి పొందడానికి అంబరీష మహారాజు హరిభక్తి పరాయణుడయ్యాడు. ఏకాదశి వ్రతం ఆచరించి నియమ నిష్ఠలతో ఉపాసించి, విష్ణు సాయుజ్యం పొందాడు.

దుర్భర దారిద్ర్యంలో మగ్గిన కుచేలుడు ఈ వ్రతము చేసి వాసుదేవుడి అనుగ్రహానికి పాత్రుడయ్యాడు. అందువల్ల అతడు సిరిసంపదలు సకల సౌఖ్యాలు అనుభవించాడు.

ఏకాదశి వ్రతంలో రాముడు, కృష్ణుడు, శివుణ్ని స్మరించటం, ఆదిత్యుడికి అర్ఘ్యప్రదానం, ఉపవాసం, గంగాస్నానం, వ్రతకథా శ్రవణం, జాగరణ, గోదాన భూదానాలు ప్రధానమైన అంశాలు.

ఇవి పాటిస్తే అశ్వమేధ యాగవలం, అరవై సంవత్సరాల తపోవలం ప్రాప్తిస్తాయని స్మృతి పురాణాన్ని బట్టి తెలుస్తోంది.

**ఆరోగ్య పరిరక్ష కోసం ఏకాశి వ్రతం...**
ఉత్తరాయణంలో కంటే దక్షిణాయనంలో పర్వదినాలు ఎక్కువగా వస్తాయి. వాతావరణంలో మార్పులు అధికంగా సంభవించే కాలం కూడా ఇదే. కాబట్టి ఈ కాలంలో ఆరోగ్య పరిరక్షణా నియమాలు ఆచరించాలి. అందువల్ల ఈ కాలంలో పెద్దలు వ్రతాలు, పూజలు ఆచరించాలని నిర్దేశించారు.

అంటే తొలి ఏకాదశి ఉపవాస దీక్ష ఆరోగ్య పరంగానూ ఎంతో మేలు చేస్తుంది. ఇక ఏకాదశి రోజున వరి అన్నం తినరాదని తెలిపేందుకు ఒక కథ ప్రచారంలో ఉంది.

మహావిష్ణువు వరంతో అన్నంలో దాగిన పాపపురుషుడు, బ్రహ్మ పాలభాగం నుంచి కిందపడిన చెమట బిందువులో అవతరించిన రాక్షసుడు తమ నివాసానికి చోటు ఇవ్వమని అడిగారు.

అప్పుడు బ్రహ్మ ఏకాదశి నాడు భుజించే వరి అన్నంలో నివసించమని వరం ప్రసాదించాడు. దీంతో ఈ రాక్షసులు ఇద్దరూ ఆ రోజు అన్నంలో ఉంటారు. కాబట్టి ఉదరంలోకి చేరి క్రిములుగా మారి అనారోగ్యాన్ని కలిగిస్తారని మన పురాణాలు హెచ్చరిస్తున్నాయి.

అందువల్లే తొలి ఏకాదశినాడు ఉపవాసం ఉంటే ఎంతో శ్రేష్ఠమని విశ్వాసం.

ఏకాదశి రోజున రాత్రంతా జాగరణ చేసి, విష్ణుసహస్రనామ పారాయణ, విష్ణుమూర్తికి సంబంధించిన భాగవతాన్ని చదువుకోవడం లాంటివి చేయాలి.

మరునటి రోజైన ద్వాదశి నాడు సమీపంలోని దేవాలయానికి వెళ్లి ఉపవాస దీక్షను విరమించాలి.

**పూజలు:** 'తొలి ఏకాదశి రోజున ఆవులను పూజిస్తే విశేష ఫలితాలు కలుగుతాయని చెబుతారు. గృహస్థులైన శ్రీహరి భక్తులు ఈ నాలుగు మాసాలు అంటే ఆషాఢ శుద్ధ ఏకాదశి నుంచి కార్తీక శుద్ధ ఏకాదశి వరకు కామక్రోధాదులను వీడి, ఒంటిపూట భోజనం చేస్తూ దీక్షతో శ్రీహరిని ఆరాధిస్తే అశ్వమేధయాగఫలం సిద్ధిస్తుందని పురాణాలు చెబుతున్నాయి. మరోవైపు నాలుగు నెలల పాటు మహావిష్ణువు జల శయనం చేయడం వల్ల విష్ణు తేజం నీటిలో వ్యాపించి ఉంటుంది. అందుకే చాతుర్మాస్యం (నాలుగు నెలలు) చేసే నదీ స్నానం శుభ ఫలితాలను ఇస్తుంది. నదికి వెళ్లి స్నానం చేయలేని వారు దగ్గరలో ఉన్న చెరువు లేదా బావుల్లో భక్తిపూర్వకంగా స్నానం అచరించి పుణ్య ఫలాన్ని పొందవచ్చు.

**ఇంకా చాతుర్మాన్య ప్రారంభం...** సమాప్తం ..సమయాల్లో విష్ణు భగవానునికి అతి ప్రీతికరమైన ఏకాదశుల్లో పుణ్యస్నానాలు ఆచరించడం ద్వారా భక్తులు సత్ఫలితాలు పొందుతారని పురాణాలు వివరిస్తున్నాయి.

# సుప్రీంకోర్టుకు ఇద్దరు కొత్త జడ్జిల నియామకం

- మొదటి పేజీ తరువాయి
ప్రధాన న్యాయమూర్తిని సంప్రదించిన అనంతరం నియమించామని పేర్కొన్నారు. కాగా వీరిద్దరికీ పదోన్నత కల్పిస్తూ ఇదివరకే సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. దీనికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. కొత్తగా చేరిన ఇద్దరు జడ్జిలతో కలుపుకొని సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తి సహా మొత్తం జడ్జిల సంఖ్య 34కు చేరింది.

**మణిపూర్ నుంచి తొలి సుప్రీం జడ్జి**
ప్రస్తుతం జమ్మూ కశ్మీర్, లడఖ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్ మణిపూర్ నుంచి సుప్రీంకోర్టు జడ్జిగా పదోన్నతి పొందిన మొదటి వ్యక్తిగా చరిత్ర సృష్టించారు. మణిపూర్ మొదటి అడ్వకేట్ జనరల్ ఎన్ ఇబోటోంబి సింగ్ కుమారుడే జస్టిస్ కోటీశ్వర్ సింగ్. ఢిల్లీ విశ్వవిద్యాలయం పరిధిలోని కిరోరి మాల్ కాలేజ్ అండ్ క్యాంపస్ లా సెంటర్‌లో న్యాయశాస్త్రం చదివారు. 1986లో న్యాయవాదిగా కెరియర్ మొదలుపెట్టారు. జడ్జిగా పదోన్నత పొందడానికి ముందు మణిపూర్ అడ్వకేట్ జనరల్‌గా కూడా విధులు నిర్వర్తించారు. గౌహతి హైకోర్టు, మణిపూర్ హైకోర్టులలో పనిచేశారు.

**9 వేలకుపైగా కేసులు వాదించిన జస్టిస్ మహదేవన్**
ఇక జస్టిస్ మహదేవన్ విషయానికి వస్తే ప్రస్తుతం ఆయన మద్రాసు హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నారు. చెన్నైలో జన్మించిన ఆయన మద్రాసు లా కాలేజీలో చదువుకున్నారు. న్యాయవాదిగా 9,000లకు పైగా కేసులు వాదించారు. తమిళనాడు ప్రభుత్వానికి అడిషనల్ గవర్నమెంట్ ప్లీడర్‌గా(పన్నులు), మద్రాసు హైకోర్టులో భారత ప్రభుత్వానికి అడిషనల్ సెంట్రల్ గవర్నమెంట్ స్టాండింగ్ కౌన్సెల్‌గా, సీనియర్ ప్యానెల్ న్యాయవాదిగా కూడా పనిచేశారు. 2013లో మద్రాసు హైకోర్టు న్యాయమూర్తిగా ఆయనకు ప్రమోషన్ వచ్చింది.

# ప్రభుత్వ ఉత్తర్వులు తొలిసారి తెలుగులో జారీ చేయడం చాలా సంతోషకరం

- మొదటి పేజీ తరువాయి
ఉత్తర్వులు తొలిసారి తెలుగులో జారీ చేయడం చాలా సంతోషకరం అని తెలిపారు. "ప్రజల కోసమే పరిపాలన అయినప్పుడు... ప్రజలకు సులువుగా అర్థమయ్యే భాషలోనే ప్రభుత్వ ఉత్తర్వులు, పరిపాలనకు సంబంధించిన సమాచారం ఉండాలని నేను ఎప్పటినుంచో చెబుతున్నాను. ప్రజల సౌలభ్యానికి ప్రాధాన్యతనిస్తూ, తెలుగులో ఉత్తర్వులు జారీ చేసినందుకు తెలంగాణ ప్రభుత్వానికి, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు గారికి, ఈ ఉత్తర్వుల రూపకల్పనలో పాలుపంచుకున్న ఇతర అధికారులు, సిబ్బందికి అభినందనలు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఇక నుంచి అన్ని ఉత్తర్వులను, సమాచారాన్ని పూర్తిగా తెలుగులోనే అందించాలని ఆకాంక్షిస్తున్నాను" అంటూ వెంకయ్యానాయుడు ట్వీట్ చేశారు.

# సేఫ్ జోన్ లోనూ బాంబుల వర్షం కురిపిస్తున్న ఇజ్రాయెల్

- మొదటి పేజీ తరువాయి
భీకర దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో 17 మంది మృతి చెందారు.

హమాస్ పై ఇజ్రాయెల్ యుద్ధం ప్రకటించిన తర్వాత వేలాది మంది శరణార్థులు మువాసీ ప్రాంతానికి తరలివచ్చారు. ఈ ప్రాంతాన్ని ఇటీవలే సేఫ్ జోన్ల జాబితాలో చేర్చారు. అయితే, ఇజ్రాయెల్ అవేవీ పట్టించుకోకుండా, హమాస్ ఉగ్రవాదులను తుదముట్టించడమే లక్ష్యంగా దాడులు చేపట్టింది. మొత్తమ్మీద వివిధ ప్రాంతాల్లో ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో కొన్ని గంటల వ్యవధిలోనే 60 మంది పాలస్తీనా వాసులు మృతి చెందారు. ఈ మేరకు గాజా హెల్త్ డిపార్ట్‌మెంట్ వెల్లడించింది.

గత శనివారం కూడా ఇజ్రాయెల్ ఇదే ప్రాంతంలో దాడులు చేపట్టగా, 90 మంది మరణించారు.

# బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కూడా లేని ఆ భయానక చట్టాన్ని గత ప్రభుత్వం తీసుకువచ్చింది: మంత్రి పార్థసారథి

నేడు జరిగిన ఏపీ క్యాబినెట్ సమావేశం వివరాలను మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు తెలియజేశారు. మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుపై ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. ఈ చట్టాన్ని బీజేపీ పాలిత రాష్ట్రాలు కూడా అమలు చేయడంలేదని తెలిపారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పై పలు సందేహాలు ఉన్నాయని అన్నారు. గత ప్రభుత్వం ఎవరితోనూ చర్చించకుండానే, హడావిడిగా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకువచ్చిందని పార్థసారథి ఆరోపించారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టంతో ముఖ్యంగా రైతులు ఆందోళనకు గురయ్యారని తెలిపారు. నీతి ఆయోగ్ ప్రతిపాదించిన చట్టానికి, గత ప్రభుత్వం తీసుకువచ్చిన ల్యాండ్ టైటిలింగ్ చట్టానికి సంబంధం లేదని స్పష్టం చేశారు. ప్రజలకు కలిగే లాభనష్టాల గురించి ఆలోచించకుండా, ఒక భయంకరమైన చట్టాన్ని తీసుకువచ్చారని విమర్శించారు. ఈ చట్టం ప్రకారం... భూమి టైటిల్ రిజిస్ట్రేషన్ అధికారిగా ఎవరినైనా నియమించవచ్చనే అంశం దారుణం అని మంత్రి పార్థసారథి పేర్కొన్నారు. అధికారిని నియమిస్తారా, లేక నామినేటెడ్ వ్యక్తిని నియమిస్తారా అనేది స్పష్టత లేదన్నారు. పైగా, ఈ టైటిల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ కు అపరిమత అధికారాలు ఇవ్వడం, ఆయన తీసుకున్న నిర్ణయమే అంతిమం అని పేర్కొనడం అత్యంత ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు.

పాత ఇసుక విధానం రద్దు అవుతుందని, పలు ఒప్పందాలు కూడా రద్దవుతాయని తెలిపారు. ఇక నుంచి ఉచితంగా ఇసుక సరఫరా చేయాలని నిర్ణయం తీసుకున్నామని మంత్రి పార్థసారథి చెప్పారు. ఇసుక సరఫరాలో ప్రభుత్వానికి ఎలాంటి ఆదాయం రాదని స్పష్టం చేశారు. ఉచిత ఇసుక పాలసీ అమలుపై కమిటీ వేసి పర్యవేక్షిస్తామని వెల్లడించారు. ఇసుక అంశంపై గత సర్కారు కోర్టులకు తప్పుడు వివరాలు అందించిందని ఆరోపించారు.

ఇక, ఎంఎస్ పీ విధానాలతో రైతులకు అనేక ఇబ్బందులు ఉన్నాయని గుర్తించినట్టు మంత్రి పార్థసారథి తెలిపారు. ధాన్యం సంచుల కోసం రైతులు ఇబ్బందులు పడుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందని వెల్లడించారు.

# కేసీఆర్ న్యాయవిచారణ ఎదుర్కోకుండా అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారు: మధుయాష్కీ

**విద్యుత్ కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం న్యాయ విచారణను చేపడుతుందని వెల్లడి**

**విద్యుత్ ఒప్పందాలపై సుప్రీంకోర్టు విచారణ వ్యవస్థను రద్దు చేయలేదన్న మధుయాష్కీ**

**విచారణ చేసే జడ్జిని మాత్రమే మార్చమని సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చిందన్న కాంగ్రెస్ నేత**



**హైదరాబాద్ పెన్ పవర్:** విద్యుత్ కొనుగోళ్ల విషయంలో అక్రమాలు జరిగాయని, కానీ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ న్యాయవిచారణ ఎదుర్కోకుండా అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత మధుయాష్కీ అన్నారు. మంగళవారం ఆయన గాంధీ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ... విద్యుత్ కొనుగోళ్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం న్యాయ విచారణను చేపడుతోందన్నారు. విద్యుత్ ఒప్పందాలపై సుప్రీంకోర్టు విచారణ వ్యవస్థను రద్దు చేయలేదని, విచారణ చేసే జడ్జిని మాత్రమే మార్చమని సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చిందని పేర్కొన్నారు. టెక్నికల్ గ్రౌండ్స్ పైనే మార్చాలని న్యాయస్థానం చెప్పినట్లు తెలిపారు. అసలు పక్క రాష్ట్రం నుంచి విద్యుత్‌ను ఎలా కొనుగోలు చేస్తారని ప్రశ్నించారు. విద్యుత్ ప్లాంట్ల నిర్మాణంలో, విద్యుత్ కొనుగోళ్లలో భారీ అవినీతి జరిగిందన్నారు. అక్రమంగా దోచుకున్న సొమ్మును కక్కిస్తామన్నారు.

# రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ ఆరోగ్యశ్రీ ఉండాలి.. తెల్ల రేషన్ కార్డుతో లింక్ పెట్టొద్దు

- మొదటి పేజీ తరువాయి
అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే వైద్యులకు పారితోషికం పెంచాలని చెప్పారు. ఆర్ఎంపీ, పీఎంపీల సమస్యలను పరిష్కరించాలని సూచించారు. వీరికి ట్రైనింగ్ ఇచ్చి, సర్టిఫికెట్ ఇవ్వాలనే డిమాండ్ ఉందని... దీనికి సంబంధించి అధ్యయనం చేసి, కొత్త జీవో ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని చెప్పారు. హాస్పిటల్స్ నిర్వహణ కోసం ప్రత్యేక వ్యవస్థను తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రతి బెడ్ కు ఒక సీరియల్ నెంబర్ కేటాయించాలని చెప్పారు.

## 'తెలంగాణ రైతన్నకు మీ రేవంతన్న మాట'.. సీఎం ఎమోషనల్ ట్వీట్

- మొదటి పేజీ తరువాయి
చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైందని రేవంత్ రెడ్డి ట్వీట్ లో పేర్కొన్నారు. ఎంత కష్టమైనా, ఎంత భారమైనా, ఏకకాలంలో రుణమాఫీ చేస్తామని తేల్చిచెప్పారు. అన్నం పెట్టే రైతును అప్పుల ఊబి నుంచి ఆశల సాగు క్షేత్రం వైపు నడిపించే బృహత్తర సాహసమే రైతు రుణమాఫీ పథకమని అభివర్ణించారు.

ఇది కేవలం కాంగ్రెస్ ప్రభుత్వానికి మాత్రమే సాధ్యమైన ఘనత అని అన్నారు. నాడు మన్మోహన్ సింగ్ ప్రభుత్వంలో దేశ రైతాంగానికి, నేడు ప్రజాప్రభుత్వ పాలనలో తెలంగాణ రైతాంగానికి కాంగ్రెస్ అందించే భరోసా అని చెప్పుకొచ్చారు. రుణమాఫీ అమలులో తొలి అడుగు కేబినెట్ ఆమోదం కాగా, మలి అడుగు విధివిధానాల ఖరారు అని సీఎం తెలిపారు. ప్రజాప్రభుత్వం చేసే ప్రతి నిర్ణయంలో రైతు సంక్షేమ కోణం ఉంటుందని పేర్కొన్నారు. 'ఇది రైతన్నకు.. మీ రేవంతన్న మాట' అంటూ ముఖ్యమంత్రి మంగళవారం ట్వీట్ చేశారు.

# సుప్రీంకోర్టులో కేసీఆర్ కు ఎదురుదెబ్బ

- మొదటి పేజీ తరువాయి
నరసింహారెడ్డి స్థానంలో మరొకరిని నియమించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. దీంతో, కమిషన్ ఛైర్మన్ ను మారుస్తామని సుప్రీంకోర్టుకు తెలంగాణ ప్రభుత్వం తెలిపింది. రిటైర్డ్ జడ్జిలతో తాము సంప్రదింపులు జరుపుతున్నామని, కొత్త ఛైర్మన్ పేరును తెలిపేందుకు సమయం కావాలని... సోమవారం కొత్త ఛైర్మన్ పేరును తెలియజేస్తామని కోర్టుకు తెలిపింది.

# కేసీఆర్ కు విశ్వసనీయత లేదు.. ఏమైనా చేయొచ్చని రేవంత్ భావిస్తున్నారు

**హైదరాబాద్ పెన్ పవర్:** అడ్డదారులు తొక్కి, ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ హామీ ఇచ్చిందని... ఇప్పుడు రుణమాఫీకి తెల్ల రేషన్ కార్డు ఉండాలనే నిబంధన పెట్టారని విమర్శించారు. రైతు రుణమాఫీకి 6 పేజీల నిబంధనలు పెట్టారని మండిపడ్డారు. రుణమాఫీ నిబంధనలు రైతులకు ఉరితాడుగా మారాయని చెప్పారు. రేషన్ కార్డులకు దరఖాస్తులు తీసుకుని 7 నెలలైనా ఎందుకు మంజూరు చేయలేదని ప్రశ్నించారు. కేసీఆర్ విశ్వసనీయత లేని నాయకుడని.. అందుకే ఆయనకు ప్రజలు బొంద పెట్టారని అన్నారు. కేసీఆర్ ను ఓడించాలని కాంగ్రెస్ అడ్డగోలు హామీలు ఇచ్చిందని చెప్పారు.

# తెలంగాణలోని అంగన్వాడీలకు గుడ్ న్యూస్

- మొదటి పేజీ తరువాయి
మూడు రోజులలో దీనికి సంబంధించి జీవో జారీ చేస్తామని పేర్కొన్నారు. ఈమేరకు మంగళవారం హైదరాబాద్ లోని రహమత్ నగర్ లో జరిగిన 'అమ్మ మాట– అంగన్వాడీ బాట' కార్యక్రమంలో మంత్రి సీతక్క ఈ ప్రకటన చేశారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద పదవీ విరమణ పొందే టీచర్ కు రూ.2 లక్షలు, ఆయాలకు రూ. లక్ష చొప్పున తెలంగాణ ప్రభుత్వం అందజేయనుంది. నామమాత్రపు వేతనంతో సేవలందిస్తున్న అంగన్వాడీ సిబ్బంది కష్టాలు ప్రభుత్వానికి తెలుసని మంత్రి చెప్పారు. అంగన్వాడీ సిబ్బందికి ఇచ్చిన హామీని తమ ప్రభుత్వం నిలబెట్టుకుంటుందని, రెండు మూడు రోజుల్లో ఈమేరకు జీవో విడుదల చేస్తామని మంత్రి సీతక్క తెలిపారు.

# విజయసాయిరెడ్డీ.. మీడియా ప్రతినిధులను మీరు అసభ్య పదజాలంతో దూషించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా: నారా లోకేశ్

**అక్రమ సంబంధం వార్తల నేపథ్యంలో నిన్న విజయసాయిరెడ్డి ప్రెస్ మీట్**

**విజయసాయి భాష అభ్యంతరకరమన్న లోకేశ్**

**ప్రజలు ఛీ కొట్టినా మీకు బుద్ధి రాలేదని తీవ్ర వ్యాఖ్యలు**

**హైదరాబాద్ పెన్ పవర్:** వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి నిన్న ప్రెస్ మీట్ లో మీడియా ప్రతినిధులను ఉద్దేశిస్తూ వాడిన భాషపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒక మహిళా అధికారితో విజయసాయిరెడ్డికి అక్రమ సంబంధం ఉందనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియా ప్రతినిధులను అరేయ్, ఒరేయ్ అంటూ మాట్లాడారు. విజయసాయిరెడ్డి వాడిన పదజాలంపై ఏపీ మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా మండిపడ్డారు. విజయసాయిరెడ్డి గారు... మీపై వచ్చిన ఆరోపణలపై వివరణ ఇచ్చేందుకు పెట్టిన ప్రెస్ మీట్ లో మీరు వాడిన భాష తీవ్ర అభ్యంతరకరమని లోకేశ్ అన్నారు. మీడియా ప్రతినిధులను అసభ్య పదజాలంతో మీరు దూషించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని చెప్పారు. పెద్దల సభ ప్రతినిధిగా ఉన్న మీకు తాను మంచీమర్యాదల గురించి చెప్పాల్సిన అవసరం లేదని అన్నారు. మీకు అధికారం పోయినా అహంకారం మాత్రం ఇంకా తగ్గలేదని విమర్శించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో మీ భాష, ప్రవర్తన, అవినీతి, అరాచకం చూసి ప్రజలు ఛీ కొట్టినా ఇంకా మీకు బుద్ధి రాలేదని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

# ఫేక్ సర్టిఫికేట్ వివాదం నేపథ్యంలో ప్రొబేషనరీ ఐఏఎస్ పూజా ఖేద్కర్ శిక్షణ రద్దు

- ముస్సోరీలోని లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ నిర్ణయం
- ఆమె సమర్పించిన అంగవైకల్య సర్టిఫికేట్ నకిలీదనే ఆరోపణల నేపథ్యంలో తాత్కాలికంగా శిక్షణ రద్దు
- అన్ని సర్టిఫికేట్‌లను పరిశీలించిన తర్వాత తుది నిర్ణయం తీసుకునే అవకాశం



**హైదరాబాద్ పెన్ పవర్:** వివాదాస్పద ప్రొబేషనరీ ఐఏఎస్ అధికారిణి పూజా ఖేద్కర్ శిక్షణ రద్దయింది. సివిల్ సర్వీసెస్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించేందుకు నకిలీ అంగవైకల్య, ఓబీసీ సర్టిఫికేట్‌లను సమర్పించారనే ఆరోపణల నేపథ్యంలో శిక్షణను రద్దు చేస్తూ ముస్సోరీలోని లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం పూజా ఖేద్కర్‌కు సమాచారం అందించింది. వివాదం నేపథ్యంలో సర్టిఫికేట్‌ను పరిశీలించాల్సి ఉందని, అందుకే తాత్కాలికంగా శిక్షణను రద్దు చేస్తున్నట్టు లేఖ రాసింది.
జిల్లా శిక్షణా కార్యక్రమాన్ని తాత్కాలికంగా నిలిపివేయాలని నిర్ణయించామని, ఈ మేరకు మహారాష్ట్ర ప్రభుత్వానికి కూడా సమాచారం అందించామని లేఖలో పేర్కొంది. తదుపరి చర్య కోసం వెంటనే అకాడమీకి రావాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ 23 జులై లోగా అకాడమీకి రావాలని మహారాష్ట్ర రాష్ట్ర ప్రభుత్వానికి రాసిన లేఖలో పేర్కొంది.
కాగా ట్రైనీ ఐఏఎస్ అయిన పూజా ఖేద్కర్‌పై మరిన్ని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఆగష్టు 2022లో పూణే జిల్లా పింప్రిలోని ఔంద్ ప్రభుత్వ ఆసుపత్రి నుంచి తీసుకున్నట్టుగా ఆమె సమర్పించిన పాక్షిక 'లోకోమోటర్ వైకల్యం' సర్టిఫికేట్ ఫేక్ అని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు యూపీఎస్సీకి ఆమె అందజేసిన సర్టిఫికేట్‌లలో సరిగా కనిపించని వాటిపై విచారణ చేయబోతున్నట్టు పోలీసులు ప్రకటించిన విషయం తెలిసిందే.
కాగా గతంలో అహ్మద్‌నగర్ జిల్లా సివిల్ హాస్పిటల్ నుంచి తీసుకున్న పీడబ్ల్యూబీడీ కేటగిరి (పర్సన్స్ విత్ బెంచ్‌మార్క్ డిజేబిలిటీస్) సర్టిఫికేట్‌లను 2018, 2021లలో యూపీఎస్సీకి సమర్పించారు. అయితే ఆగష్టు 2022లో పూణేలోని ఔంధ్ ప్రభుత్వ ఆసుపత్రిలో అంగవైకల్య ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకున్నారు. కానీ వైద్య పరీక్షల అనంతరం దరఖాస్తును వైద్యులు తిరస్కరించారు. ఆమె అనుచిత ప్రవర్తన నేపథ్యంలో నకిలీ అంగవైకల్యా సర్టిఫికేట్ విషయం తాజాగా వెలుగుచూడడం ఆమెను మరింత చిక్కుల్లో పడేసింది.
మహారాష్ట్ర కేడర్‌కు చెందిన 2023–బ్యాచ్ ఐఏఎస్ అధికారి అయిన పూజా ఖేద్కర్ పూణే కలెక్టర్ కార్యాలయంలో తనకు ప్రత్యేక అధికారాలు కావాలంటూ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారనే ఆరోపణలు వచ్చాయి. తన సొంత కారుకు నీలిరంగు బుగ్గను కూడా బిగించుకున్నారు. మీడియాలో ఆమెపై తీవ్ర విమర్శలు వచ్చాయి. దీంతో మహారాష్ట్ర ప్రభుత్వం ఆమెను పూణే నుంచి బదిలీ చేసిన విషయం తెలిసిందే.

# బడ్జెట్ సన్నాహాలు... పార్లమెంటులో హల్వా తయారుచేసిన కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్

జులై 22 నుంచి పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు
జులై 23న బడ్జెట్ ప్రవేశపెట్టనున్న కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్
పార్లమెంటు నార్త్ బ్లాక్ లో హల్వా తయారీ కార్యక్రమం
హాజరైన నిర్మలా సీతారామన్, ఆర్థిక శాఖ అధికారులు, పార్లమెంటు సిబ్బంది



**హైదరాబాద్ పెన్ పవర్:** ఎన్డీయే 3.0 ప్రభుత్వం వచ్చాక తొలిసారి పూర్తి స్థాయి పార్లమెంటు సమావేశాలు జులై 22 నుంచి ఆగస్టు 12 వరకు నిర్వహించనున్నారు. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ జులై 23న పార్లమెంటులో కేంద్ర బడ్జెట్ ను ప్రవేశపెట్టనున్నారు.
బడ్జెట్–2024 సన్నాహాలు తుది దశకు చేరుకున్న నేపథ్యంలో, సంప్రదాయం ప్రకారం పార్లమెంటులో నిర్మలా సీతారామన్ హల్వా తయారుచేశారు. ఆర్థిక శాఖ అధికారులకు, పార్లమెంటు సిబ్బందికి ఆమె స్వయంగా హల్వాను వడ్డించారు. ఈ కార్యక్రమం పార్లమెంటు నార్త్ బ్లాక్ లో నిర్వహించారు.

# వరుసగా మూడో రోజు లాభాల్లో ముగిసిన మార్కెట్లు

52 పాయింట్లు లాభపడ్డ సెన్సెక్స్
26 పాయింట్లు పెరిగిన నిఫ్టీ
2.70 శాతం పెరిగిన హిందుస్థాన్ యూనిలీవర్ షేరు విలువ



**హైదరాబాద్ పెన్ పవర్:** దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడో రోజు కూడా లాభాల్లో ముగిశాయి. ఈ ఉదయం లాభాల్లో ప్రారంభమైన మార్కెట్లు మధ్యలో అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. చివరకు మళ్లీ కొనుగోళ్లు జరగడంతో లాభాల్లో ముగిశాయి. ఈరోజు ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 52 పాయింట్లు లాభపడి 80,717కి చేరుకుంది. నిఫ్టీ 26 పాయింట్లు పుంజుకుని 24,613 వద్ద స్థిరపడింది. అమెరికా డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ. 83.58గా ఉంది.

**బీఎస్ఈ సెన్సెక్స్ టాప్ గెయినర్స్:**
హిందుస్థాన్ యూనిలీవర్ (2.70%), భారతి ఎయిర్ టెల్ (2.00%), టెక్ మహీంద్రా (1.13%), ఇన్ఫోసిస్ (1.09%), మహీంద్రా అండ్ మహీంద్రా (0.95%).

**టాప్ లూజర్స్:**
కోటక్ బ్యాంక్ (–2.11%), ఎన్టీపీసీ (–1.35%), రిలయన్స్ (–1.32%), అల్ట్రాటెక్ సిమెంట్ (–1.23%), పవర్ గ్రిడ్ కార్పొరేషన్ (–0.42%).

# ఢిల్లీ బయల్దేరిన ఏపీ సీఎం చంద్రబాబు

రాష్ట్ర, ప్రజా ప్రయోజనాల కోసమే ఢిల్లీ వెళుతున్నానన్న చంద్రబాబు
రాష్ట్రానికి చాలా అవసరాలు ఉన్నాయని వ్యాఖ్య
కేంద్రం సహకారం ఎంతో ముఖ్యమని వివరణ



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ పర్యటనకు బయల్దేరారు. రాష్ట్ర, ప్రజా ప్రయోజనాల కోసమే ఢిల్లీ వెళుతున్నానని చంద్రబాబు తెలిపారు. రాష్ట్రానికి చాలా అవసరాలు ఉన్నాయని స్పష్టం చేశారు. కేంద్రం సహకారం ఎంతో ముఖ్యమని, కేంద్రం అండతో అన్నీ సాకారం చేస్తామని పేర్కొన్నారు. అంతకుముందు, ఏపీ క్యాబినెట్ భేటీ అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఏపీకి రావడానికి పరిశ్రమలు ఆసక్తిగానే ఉన్నా, భూతం భయం ఇంకా పోలేదని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం వల్ల, స్వేచ్ఛగా బతుకుతున్నామనే భావనకు ప్రజలు వచ్చారని తెలిపారు. వైసీపీ ప్రచారం చేసే ఫేక్ న్యూస్ లతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాష్ట్రంలో స్కిల్ సెన్సస్ (నైపుణ్య గణన) ప్రారంభించామని చంద్రబాబు వెల్లడించారు.

# రుణమాఫీకి రేషన్ కార్డు నిబంధనపై క్లారిటీ ఇచ్చిన రేవంత్ రెడ్డి


పాస్ బుక్ ఆధారంగానే రుణమాఫీ ఉంటుందన్న రేవంత్
కుటుంబాన్ని గుర్తించేందుకే రేషన్ కార్డు నిబంధన అని వెల్లడి
ఎల్లుండి సాయంత్రానికల్లా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయన్న సీఎం



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో పంట రుణాల మాఫీకి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైన సంగతి తెలిసిందే. అయితే రుణమాఫీకి రేషన్ కార్డు ఉండాలనే నిబంధన అందరినీ గందరగోళానికి గురి చేసింది. ప్రభుత్వంపై విపక్షాలు విమర్శలు ఎక్కుపెట్టాయి. ఈ నేపథ్యంలో ఈ అంశంపై సీఎం రేవంత్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. పాస్ బుక్ ఆధారంగానే రూ. 2 లక్షల రుణమాఫీ ఉంటుందని ఆయన చెప్పారు. అయితే, కుటుంబాన్ని గుర్తించేందుకే రేషన్ కార్డు నిబంధన పెట్టామని తెలిపారు. ఈ నెల 18లోపు రూ. లక్ష లోపు రుణాలను మాఫీ చేస్తామని చెప్పారు. ఎల్లుండి సాయంత్రానికల్లా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని తెలిపారు. రుణమాఫీ సంబరాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

# ముచ్చుమర్రిలో బాలిక హత్య ఘటనపై ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా వివరణ

నంద్యాల జిల్లా ముచ్చుమర్రిలో బాలికపై హత్యాచారం
పార్కు సమీపంలో బాలికపై ముగ్గురు బాలురు అత్యాచారం చేశారన్న ఎస్పీ
ఊరి బయటికి తీసుకెళ్లి బాలికను గొంతు నులిమి చంపారని వెల్లడి
మృతదేహానికి రాళ్లు కట్టి కృష్ణా నదిలో పడేశారని వివరణ




**హైదరాబాద్ పెన్ పవర్:** నంద్యాల జిల్లా ముచ్చుమర్రిలో వాసంతి అనే బాలిక హత్యకు గురవడం తెలిసిందే. జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తాజాగా ఈ కేసుకు సంబంధించిన వివరాలు తెలిపారు.
పగిద్యాల మండలం ముచ్చుమర్రిలో చిన్నారి వాసంతిపై పార్కు సమీపంలో ముగ్గురు బాలురు అత్యాచారం చేశారని వెల్లడించారు. అనంతరం ఊరి బయటకు తీసుకెళ్లి బాలిక గొంతు నులిమి హత్య చేశారని వివరించారు. ఘటన తర్వాత ఈ విషయాన్ని నిందితులు తమ కుటుంబ సభ్యులు, బంధువులకు చెప్పారని ఎస్పీ వెల్లడించారు.
కాగా, నిందితులు బాలిక మృతదేహాన్ని బైక్ పై వనములపాడుకు తీసుకెళ్లారని, అక్కడ్నించి చిన్న తెప్పపై కృష్ణానదిలోకి తీసుకెళ్లి, మృతదేహానికి రాళ్లు కట్టి నదిలో పడేశారని వివరించారు.బాలిక మృతదేహం కోసం ముమ్మరంగా గాలిస్తున్నామని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తెలిపారు. ముచ్చుమర్రి రాజకీయాలతో బాలిక వాసంతి హత్య ఘటనకు సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ కేసుపై దర్యాప్తు కొనసాగుతోందని చెప్పారు.

# సముద్రంలో పడిపోయిన ఏడాది తర్వాత దొరికిన యాపిల్ వాచ్.. ఇప్పటికీ పనిచేస్తున్న వైనం



**హైదరాబాద్ పెన్ పవర్:** యాపిల్ కంపెనీ వాచ్‌లకు ప్రపంచవ్యాప్తంగా విశేషమైన ఆదరణ ఉంది. కేవలం టైమ్ చూసుకునేందుకే కాదు.. చాలా మంది వినియోగదారులు తమ ఫిట్‌నెస్ డేటాను ఎప్పటికప్పుడు ట్రాక్ చేసేందుకు ఈ వాచ్‌లను వాడుతుంటారు. ముఖ్యంగా రన్నింగ్, స్విమ్మింగ్, స్కూబా డైవింగ్, జిమ్‌లో వర్కౌట్స్‌తో పాటు పలు హెల్త్ అలర్ట్స్ కోసం వినియోగిస్తుంటారు. అయితే ఈ వాచ్‌లను సురక్షితమైన ప్రదేశాలలో వాడితే ఎలాంటి ఇబ్బందీ ఉండదు. కానీ లోతైన నీటి ప్రదేశాలలో వాడడం ఏమంత మంచిది కాదు. ఎందుకంటే వాచ్ నీటి లోతుల్లో పడిపోతే మళ్లీ దొరకడం దాదాపు అసాధ్యమనే చెప్పాలి. కానీ అమెరికాకు చెందిన ఓ వ్యక్తి యాపిల్ వాచ్ సముద్రంలో పడిపోయిన ఏడాది తర్వాత దొరికింది. అంతేకాదు ఆశ్చర్యం కలిగించేలా ఆ వాచ్ ఇంకా కచ్చితంగా పనిచేస్తోంది.
అమెరికాకు చెందిన జారెడ్ బ్రిక్ అనే వ్యక్తి తన అనుభవాన్ని వీడియో రూపంలో వెల్లడించాడు. "కరీబియన్స్ దీవుల సముద్రంలో స్కూబా డైవింగ్ చేసినప్పుడు నా యాపిల్ వాచ్ పోయింది. డైవింగ్ చేసే ప్రతిసారీ నేను యాపిల్ వాచ్ వాడుతాను. ఒక సంవత్సరం క్రితం కరీబియన్స్‌లో డైవ్ చేసినప్పుడు (జూన్ 2022) కూడా వాచ్ ధరించాను. డైవింగ్ అయిపోయాక పైకి వచ్చి చూస్తే వాచ్ లేదు. సముద్ర అందాలను చూస్తూ వాచ్ జారిపోయిన విషయాన్ని గుర్తించలేకపోయాను" అని జారెడ్ బ్రిక్ వెల్లడించారు.

**దోహదపడ్డ 'ఫైండ్ మై ఫీచర్'**

యాపిల్ ఉత్పత్తుల్లో ఫైండ్ మై నెట్‌వర్క్ అద్భుతంగా పనిచేస్తుందనే విషయం తెలిసిందే. జారెడ్ బ్రిక్ విషయంలో కూడా ఈ ఫీచర్ పనిచేసింది. వాచ్ ఉన్న లోకేషన్ గుర్తించడంలో ఈ ఫీచర్ కీలక పాత్ర పోషించింది. వాచ్ సముద్రంలో పోయినప్పటికీ ఏదో చిన్న ఆశతో 'ఫైండ్ మై నెట్‌వర్క్'లో వాచ్ పోయినట్టుగా మార్క్ చేశాడు. అయితే అతడు ఆశించినట్టుగానే ఆశ్చర్యపరిచే అద్భుతం జరిగింది.
వాచ్ పోయిన ప్రాంతానికి సమీపంలోనే నివసించే వ్యక్తి నుంచి ఒక రోజు వాయిస్ మెయిల్ వచ్చిందని, వాచ్ దొరికినట్టు చెప్పారని జారెడ్ బ్రిక్ పేర్కొన్నాడు. అయితే వాచ్ దొరకడమే కాకుండా అది ఇంకా పనిచేస్తుండడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. 'ఫైండ్ మై నెట్‌వర్క్' ఫీచర్‌పై బ్రిక్ సెట్ చేసిన మెసేజ్ వాచ్‌పై డిస్‌ప్లే అయింది. దీంతో అతడిని చేరింది. ఫైండ్ మై డివైజ్ ఎంతలా ఉపయోగపడుతుందో ఈ ఘటన మరోసారి తెలియజేసింది. కాబట్టి ఆండ్రాయిడ్ లేదా ఇతర పరికరాల్లో అందుబాటులో ఉన్న 'ఫైండ్ మై డివైజ్' ఆప్షన్‌ను యాక్టివేట్ చేసుకోవాలని టెక్ నిపుణులు సూచిస్తున్నారు.

# మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించిన విజయసాయిరెడ్డి

సంచలనం సృష్టిస్తున్న శాంతి బిడ్డ వ్యవహారం
విజయసాయి పేరు ప్రముఖంగా వినిపిస్తున్న వైనం
ప్రెస్ మీట్ పెట్టి మరీ విజయసాయి పేరు చెప్పిన శాంతి భర్త
నిన్న మీడియా ప్రతినిధులపై విజయసాయి వ్యాఖ్యలపై లోకేశ్ అభ్యంతరం



**హైదరాబాద్ పెన్ పవర్:** శాంతి బిడ్డకు తండ్రెవరు?... ఏపీ రాజకీయ వర్గాల్లోనే కాదు, జనాల్లో కూడా ఇది హాట్ టాపిక్ గా మారింది. శాంతి వ్యవహారంలో విజయసాయిరెడ్డి పేరు వినిపిస్తుండంతో ఈ విషయానికి అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. తనపై జరుగుతున్న ప్రచారాన్ని నిన్న వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఖండించారు. ఈ సందర్భంగా ఆయన కొందరు మీడియా ప్రతినిధులను, ఏరా, ఒరేయ్, వాడు... అంటూ సంబోధించడం పట్ల ఏపీ మంత్రి నారా లోకేశ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పెద్దల సభ ప్రతినిధిగా ఉన్నారు... అధికారం పోయినా మీకు అహంకారం తగ్గలేదు... మీడియా ప్రతినిధులను మీరు అసభ్యంగా దూషించడాన్ని నేను తీవ్రంగా ఖండిస్తున్నాను అంటూ లోకేశ్ ట్వీట్ చేశారు. తాజాగా, లోకేశ్ ట్వీట్ పై విజయసాయిరెడ్డి తీవ్రంగా స్పందించారు. "నారా లోకేశ్, అతడి కుల మీడియాలో చాలావరకు పాశ్చాత్య మీడియా తరహాలో స్వేచ్ఛను కోరుకుంటున్నప్పటికీ, ఆ మీడియా పనితీరు మాత్రం ఉత్తర కొరియా మీడియా లాగా ఉంది. పాత్రికేయ విలువలను వారు తుంగలో తొక్కారు. అది ప్రజాప్రతినిధుల విషయం కానివ్వండి, మహిళా లోకానికి సంబంధించినదైనా, లేక ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ప్రజాప్రతినిధులతో ముడిపడిన అంశమైనా సరే... తమ రాజకీయ గురువుల మాటే శిరోధార్యంగా, తమ కుల ప్రయోజనాల పరిరక్షణకు పెద్ద పీట వేస్తూ... టీఆర్పీ రేటింగుల వెంట పరుగులు తీస్తున్నారు" అంటూ విజయసాయి ధ్వజమెత్తారు.

# ఆస్ట్రేలియాలో ఘనంగా టీడీపీ విజయోత్సవాలు... హాజరైన నటుడు శివాజీ




**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియాలోని మెల్బోర్న్ నగరంలో టీడీపీ గెలుపు సంబరాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ సినీ నటుడు శివాజీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రకటించిన లక్ష ఉద్యోగ అవకాశాలను అమలుపరచాలని ఎన్నారై టీడీపీ తరపున కోరారు. అలాగే వైసీపీ వాళ్లు సోషల్ మీడియాలో చేసే దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు.
ఈ వేడుకల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను అలరించాయి. దాదాపు 1,100 మంది టీడీపీ కార్యకర్తలు, మద్దతుదారులు ఈ విజయోత్సవ సంబరాలకు హాజరై జయప్రదం చేశారు. తెలుగుదేశం మెల్ బోర్న్ కమిటీ ఆధ్వర్యంలో ఈ సభను ఘనంగా నిర్వహించారు. మెల్ బోర్న్ టీడీపీ పార్టీ అధ్యక్షుడు లగడపాటి సుబ్బారావు ఆధ్వర్యంలో సభా కార్యక్రమాన్ని నిర్వహించారు.

# 'వయసు మోసం' చేశాను.. అంగీకరించిన భారత మాజీ క్రికెటర్ అమిత్ మిశ్రా

## అరంగేట్రం చేసినప్పుడు 22 ఏళ్లయితే 21 సంవత్సరాలని నమ్మించానని వెల్లడి

## కోచ్ సలహా మేరకు ఇలా చేశానని వెల్లడి

## ఓ పాడ్‌కాస్ట్‌లో ఆసక్తికరమైన విషయాలు వెల్లడించిన లక్నో సూపర్ జెయింట్స్ స్పిన్నర్ అమిత్ మిశ్రా



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్‌లో ప్రస్తుతం లక్నో సూపర్ జెయింట్స్‌కు ఆడుతున్న భారత మాజీ క్రికెటర్, స్పిన్ బౌలర్ అమిత్ మిశ్రా ఆసక్తికరమైన విషయాన్ని బయటపెట్టాడు. వయసు విషయంలో తాను మోసానికి పాల్పడ్డానని, 2003లో భారత జట్టులోకి అరంగేట్రం చేసినప్పుడు తన వయసును ఒక ఏడాది తగ్గించుకుని చూపించానని వెల్లడించాడు. అప్పుడు తన వయస్సు 22 సంవత్సరాలైతే 21 ఏళ్లుగా తప్పుదోవ పట్టించానని ఒప్పుకున్నాడు. తన కోచ్ సలహా మేరకు ఈ విధంగా వ్యవహరించినట్టు చెప్పాడు. శుభంకర్ మిశ్రా పోడ్‌కాస్ట్‌లో అమిత్ మిశ్రా ఈ విషయాలను బయటపెట్టాడు.

వయసు తక్కువగా చూపించాలనే ఆలోచన తనకు రాలేదని, తన కోచ్ ఇంటికి పిలిచి మరీ చెప్పారని అమిత్ మిశ్రా ప్రస్తావించాడు. కోచ్ ఈ విషయాన్ని చెప్పినప్పుడు తాను చాలా ఆశ్చర్యపోయానని, ఎలా సాధ్యమని ప్రశ్నించానని, అయితే వయసు తగ్గించుకునేందుకు ఒప్పుకున్నానంటూ గుర్తుచేసుకున్నాడు. ఇది చాలా భావోద్వేగ కథ అని, ఆ రోజు నుంచి తాను ఒక సంవత్సరం చిన్నవాడిని అయ్యానని చెప్పాడు. కాగా అమిత్ మిశ్రా ప్రస్తుతం ఐపీఎల్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లలో ఒకడిగా ఉన్నాడు.

### రోహిత్ శర్మతో జరిగిన సంభాషణ ఇదే..

కాగా ఐపీఎల్ 2024లో స్టార్ ప్లేయర్ రోహిత్ శర్మ, మిత్ మిశ్రా మధ్య వయసుకు సంబంధించి సరదా సంభాషణ జరిగింది. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారిన నేపథ్యాన్ని ప్రశ్నించగా పాడ్‌కాస్ట్‌లో అమిత్ మిశ్రా స్పందించారు. "నాకు నిజంగా 41 ఏళ్లేనా అంటూ రోహిత్ శర్మ ప్రశ్నించాడు. మేము చెడ్డీలు వేసుకున్నప్పుడు అరంగేట్రం చేశావ్ ఇంకా 41 ఏళ్లేనా? అని సరదాగా అన్నాడు. అవును 20-21 ఏళ్లప్పుడు చేసి ఉంటానని చెప్పాను. ఆ తర్వాత నీకు నిజంగా 74 ఏళ్లేనా అని రోహిత్‌ను అడిగాను. అతడు బిగ్గరగా నవ్వుతూ ఇక మాట్లాడొద్దు అన్నాడు. ముంబై ఇండియన్స్ వర్సెస్ లక్నో సూపర్ జెయింట్స్ మధ్య మ్యాచ్ సందర్భంగా ఇద్దరి మధ్య ఈ సరదా సంభాషణ జరిగింది" అని అమిత్ మిశ్రా వెల్లడించాడు.

# రింకూ సింగ్‌కి టెస్టుల్లో కూడా చోటివ్వాలి.. మాజీ బ్యాటింగ్ కోచ్ ఆసక్తికర వ్యాఖ్యలు

## టెస్టుల్లోకి తీసుకునే టెక్నిక్ రింకూ బ్యాటింగ్‌లో ఉందన్న విక్రమ్ రాథోర్

## నెట్స్‌లో అతడి బ్యాటింగ్ గమనించినప్పుడు టెస్టులోకి తీసుకోకపోవడానికి కారణాలేవీ కనిపించలేదని వ్యాఖ్య

## శుభ్‌మాన్ గిల్, యశస్వి జైస్వాలలను కూడా అన్ని ఫార్మాట్లలో ఆడించవచ్చునని అభిప్రాయం



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా యంగ్ బ్యాట్స్‌మెన్ రింకూ సింగ్‌కి భారత్ టెస్టు క్రికెట్ జట్టులోనూ చోటు ఇవ్వాలని, టెస్టుల్లో ఆడే టెక్నిక్ అతడికి ఉందని భారత మాజీ బ్యాటింగ్ కోచ్ విక్రమ్ రాథోర్ అభిప్రాయపడ్డాడు. టెస్టులు ఆడే టెక్నిక్ అతడి బ్యాటింగ్‌లో ఉందని, ఫస్ట్-క్లాస్ క్రికెట్‌లో అతడి 50కిపైగా ఉందని ప్రస్తావించాడు. " నేను నెట్స్‌లో రింకూ సింగ్ బ్యాటింగ్‌ను గమనించినప్పుడు అతడు టెస్ట్ బ్యాటర్ కాకపోవడానికి సాంకేతిక కారణాలు ఏంటో నాకు అర్థం కాలేదు. టీ20 క్రికెట్‌లో అతడు అద్భుతమైన ఫినిషర్‌గా పేరు తెచ్చుకున్నాడని నాకు తెలుసు. అయితే అతడి ఫస్ట్‌క్లాస్ రికార్డును పరిశీలిస్తే 50 సగటుతో ఆడాడు. అతడు మెరుగయ్యేలా కనిపిస్తున్నాడు. కాబట్టి ఈ అంశాలన్నింటినీ దృష్టిలో ఉంచుకొని అతడికి అవకాశం ఇస్తే టెస్ట్ క్రికెటర్‌గా కూడా రాణించగలడు" అని విక్రమ్ రాథోర్ అన్నారు. ఈ మేరకు ఓ జాతీయ మీడియా సంస్థతో మాట్లాడారు. ఇక రింకూ సింగ్‌తో పాటు యంగ్ క్రికెటర్లు అయిన శుభ్‌మాన్ గిల్, యశస్వి జైస్వాల్‌లను కూడా అన్ని ఫార్మాట్లలోకి తీసుకోవచ్చని అభిప్రాయపడ్డాడు. అద్భుతమైన ఆటగాళ్లు వెలుగులోకి వస్తున్నారని, అయితే గిల్, జైస్వాల్ మూడు ఫార్మాట్లలో ఎక్కువ కాలం ఆడేలా కనిపిస్తున్నారని, రాబోయే సంవత్సరాల్లో వీరిద్దరూ భారత బ్యాటింగ్‌కు వెన్నెముకగా మారబోతున్నారని రాథోర్ అభిప్రాయపడ్డారు.

### రింకూ సింగ్ ట్రాక్ రికార్డు ఇదే

రింకూ సింగ్ ఇప్పటివరకు భారత్ తరఫున 2 వన్డేలు, 20 టీ20 మ్యాచ్‌లు మాత్రమే ఆడాడు. టీ20లల రింకూ సింగ్ స్ట్రైక్-రేట్ 176.27గా ఉంది. ఇక 15 మ్యాచ్‌ల్లో 83.2 సగటుతో 416 పరుగులు బాదాడు. జట్టులో ఫినిషర్ పాత్రను పోషిస్తున్నాడు. ఇటీవలే జింబాబ్వేతో జరిగిన 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో కూడా ఆడాడు. జూన్ నెలలో వెస్టిండీస్, అమెరికాల వేదికగా జరిగిన టీ20 ప్రపంచ కప్ జట్టులో రిజర్వ్ ఆటగాడిగా కూడా ఉన్న విషయం తెలిసిందే. ఇక ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో రింకూ సింగ్ ఇప్పటివరకు 47 మ్యాచ్‌లు ఆడాడు. 7 సెంచరీలు, 20 అర్ధసెంచరీలతో కలుపుకొని 54.7 సగటుతో మొత్తం 3,173 పరుగులు సాధించాడు. కాగా భారత బ్యాటింగ్ కోచ్‌గా రాథోర్ పదవీకాలం టి20 ప్రపంచ కప్‌తో ముగిసిపోయింది.

# తన రిటైర్మెంట్ పై వస్తున్న వార్తలపై రోహిత్ శర్మ స్పందన



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ టీ20 ఫార్మాట్ కు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. త్వరలోనే వన్డే, టెస్ట్ ఫార్మాట్ల నుంచి కూడా ఆయన తప్పుకుంటారనే ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో తన రిటైర్మెంట్ అంశంపై రోహిత్ స్పందించాడు.

తాను ఇంకొంత కాలం అంతర్జాతీయ క్రికెట్ ఆడుతానని రోహిత్ స్పష్టం చేశాడు. సుదీర్ఘ కాలం క్రికెట్ ఆడే ప్రణాళికలు తన వద్ద లేవని చెప్పాడు. అమెరికాలోని డాలస్ లో ఒక క్రికెట్ అకాడెమీ ప్రారంభోత్సవానికి రోహిత్ వెళ్లాడు. ఈ సందర్భంగా రిటైర్మెంట్ పై అక్కడి అభిమానులు అతనిని ప్రశ్నించారు. వారి ప్రశ్నలకు సమాధానమిస్తూ... తన రిటైర్మెంట్ వస్తున్న ఊహాగానాలకు రోహిత్ తెరదించాడు.

ఈ నెలలో టీమిండియా శ్రీలంక టూర్ కు వెళ్లనుంది. అయితే, ఈ సిరీస్ నుంచి రోహిత్, విరాట్ కోహ్లీలకు విశ్రాంతిని ఇచ్చే అవకాశం ఉంది. ఆ తర్వాత బంగ్లాదేశ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియాలతో టీమిండియా వరుసగా మూడు సిరీస్ లను ఆడనుంది. శ్రీలంక టూర్ నుంచి కొత్త హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ బాధ్యతలను స్వీకరించనున్నాడు.

# పిక్ టాక్ : అందాల శ్రద్ధ విందుతో దాస్

## అద్భుతమైన లుక్స్

సిద్దు ఫ్రమ్ సికాకుళం సినిమాతో 15 ఏళ్ల క్రితం ఇండస్ట్రీకి పరిచయం అయిన ముద్దుగుమ్మ శ్రద్ధా దాస్. అందం విషయంలో చాలా మంది స్టార్ హీరోయిన్స్ ఈమె ముందు దిగదుడుపే అనడంలో సందేహం లేదు. అందాల ఆరబోత చేయడంలో ఈమె ముందు మరెవ్వరు నిలువరు. అయినా కూడా కాలం కలిసి రాలేదు. ఎంతటి అందాల ఆరబోత చేసినా, ఎంతగా కష్టపడ్డా కూడా సినిమాల్లో ఈ అమ్మడికి దక్కుతున్న ఆఫర్లు అరాకొర మాత్రమే. లక్కీగా తన అందం తో, అందాల ఆరబోత ఫోటోలతో ఏకంగా 15 ఏళ్లు ఇండస్ట్రీలో కొనసాగుతూనే వస్తుంది. ఆకట్టుకునే అందంతో పాటు అలరించే ఫిజిక్ ఈ అమ్మడి సొంతం అని మరోసారి నిరూపితం అయ్యింది.

%యాశ్రీంశీ =ఘుం% - యానిమల్ చూశాక.. రానా నాయుడుపై రానా వ్యూ ఇదీ!

తాజా ఫోటో షూట్ లో అందాల ముద్దుగుమ్మ శ్రద్ధా దాస్ ఆకట్టుకుంది. క్లోజప్ లో క్లీవేజ్ షో చేస్తూ వావ్ అనిపించింది. కవ్వించే చూపులతో అదరగొడుతుంది. అందాలను శ్రద్ధగా ఫోటో షూట్ ద్వారా నెటిజన్స్ కు అందించడం ఈ అమ్మడికే సాధ్యం అంటూ మరోసారి ఈ ఫోటోలు నిరూపించాయి అంటూ నెటిజన్స్ మరియు ఈ అమ్మడి అభిమానులు మాట్లాడుకుంటున్నారు. నెట్టింట తెగ సందడి చేస్తున్న ఈ ఫోటోలు చూసి చాలా మంది ఇంతటి అందగత్తెకు రావాల్సిన ఆఫర్లు రావడం లేదు, దక్కాల్సిన గుర్తింపు దక్కడం లేదు అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెట్టింట ప్రస్తుతం సందడి చేస్తున్న ఈ ఫోటోలను మీరు ఒక లుక్కేయండి.

ఇప్పటికి కూడా ఐటం సాంగ్స్ తో పాటు సినిమాలో కీలక పాత్రలకు మరియు వెబ్ సిరీస్ లకు ఈ అమ్మడిని సంప్రదిస్తున్న వారు చాలా మంది ఉన్నారు.



అందాల' రాశి' సౌందర్య లహరి





On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com